

డాక్టర్ సంధ్య విప్లవ్ రచించిన బహుజన మహిళల కథలతో కూడిన దాల్చ పుస్తకం ఆవిష్కరణ సభలో పాల్గొన్న వక్తలు

## సంవేదనల మిళితం.. దాల్చ కవిత

### శాసన మండలి సభ్యులు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 14: మానవ సంవేదనల్ని మిళితం చేసి రచయిత్రి సంధ్య దాల్చ కథా సంపుటిని గొప్పగా రచించారని శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న ప్రశంసించారు. డాక్టర్ సంధ్య విప్లవ్ రచించిన అసాధారణ బహుజన మహిళల కథలతో కూడిన దాల్చ కథల సంపుటి ఆవిష్కరణ సభ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోరటి వెంకన్న ప్రసంగిస్తూ బహుజనుల జీవితాలను కథల్లో దృశ్యమానంగా చేసిన తీరుకు రచయిత్రి సంధ్య అస్థిత్వ నేపథ్యాన్ని, ప్రతిభను తెలియజేస్తుందన్నారు. సామాజిక తత్త్వవేత్త బీఎస్ రాములు ప్రసంగిస్తూ రచయిత, కొత్త సాహిత్య వస్తువును తీసుకొని అద్భుతమైన కథలు రాశారన్నారు. ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి మాట్లాడుతూ గతంలోనే సంధ్య రాసిన అనేక కవితలు ప్రజలను ఆలోచింపజేశాయన్నారు. ఓయూ తెలుగు శాఖాచార్యులు ప్రొఫెసర్ సూర్యాధనుంజయ్ ప్రసంగిస్తూ సమాజంలోని వాస్తవితకు అద్దంపట్టేలా కథలలో నిక్షిప్తం చేశారని సంధ్యను ప్రశంసించారు. సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు పాల్గొని దాల్చ కవితా సంపుటిని సమీక్షిస్తూ ఈ కథలను విద్యార్థులు చదివినప్పుడు వారి జీవనశైలికి మార్గనిర్దేశకం చేస్తాయన్నారు.

## అవగాహనతో వంధ్యత్వాన్ని అధిగమించాలి

### ఒయాసిస్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ కీర్తన



సమావేశంలో మాట్లాడుతున్న డా.కీర్తన

జూబ్లీహిల్స్, నవంబర్ 14: అవగాహనతో వంధ్యత్వ సమస్యను అధిగమించాల్సిన అవసరం ఉందని ఒయాసిస్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ వి.కీర్తన తెలిపారు. టోలిచౌకిలోని ఒయాసిస్ ఫెర్టిలిటీలో ఐవీఎఫ్ ద్వారా సంతానం పొందిన మాతృమూర్తులను మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో 28 మిలియన్లకు పైగా దంపతులు వంధ్యత్వ సమస్యతో బాధపడుతున్నారన్నారు. వీరిలో 3 శాతం మంది మాత్రమే సంతానోత్పత్తిపై ఆసక్తి కనబరచడం విచారకరమన్నారు. అపోహలను వీడి ఈ సమస్యను అధిగమించేందుకు సంతానోత్పత్తి నిపుణుల సహాయం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఐవీఎఫ్‌లో గర్భస్రావాల ప్రమాదాలను తగ్గించడంలో పీజీటీ (ప్రీ ఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్) ఒక అధునాతన సాంకేతికత అన్నారు. స్త్రీ గర్భాశయంలోకి ఎస్ఈటీ (సింగిల్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్) ఒక పిండం మాత్రమే బదిలీ చేస్తామన్నారు. తద్వారా బహుళ గర్భాలు నిరోధించవచ్చన్నారు. దంపతులు ఒక సంవత్సరం తరువాత గర్భం దాల్చకపోతే సంతానోత్పత్తి నిపుణులను వెంటనే సంప్రదించాలన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ, సద్గురు హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ సంతానోత్పత్తి చికిత్సలలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఉత్తమ పద్ధతులు, ప్రోటోకాల్‌ను తీసుకురావడం ద్వారా భారతదేశంలో పునరుత్పత్తి సంరక్షణకు సరికొత్త నిర్వచనం ఇచ్చిందని తెలిపారు. 2009 ప్రారంభమైన ఒయాసిస్ ఫెర్టిలిటీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, జార్ఖండ్, గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘఢ్, ఒడిశా రాష్ట్రాలలో 33కు పైగా కేంద్రాలలో సేవలందిస్తుందని వెల్లడించారు.

## సమాచార నిర్ధారణ ఆర్ఓకి తప్పనిసరి కాదు

### జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, నవంబర్14: ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచిన సమాచార కచ్చితత్వాన్ని నిర్ధారించడం రిటర్నింగ్ అధికారికి తప్పనిసరి కాదని.. అఫిడవిట్‌లోని అంశాలు నిజం కావని నిరూపించగలిగితే ఎన్నికల పిటిషన్ ద్వారా సంబంధిత కోర్టులను ఆశ్రయించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈసీఐ సూచనల ప్రకారం రిటర్నింగ్ అధికారి నామినేషన్ల పరిశీలన సమయంలో అన్ని కాలమ్‌లు పూరించారా? లేదా? అన్నది పరిశీలిస్తారన్నారు. ఈసీ వెబ్‌సైట్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు దాఖలు చేసిన ఫారం-26 అఫిడవిట్ కాపీలను కేవై యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, సమాచారం విరుద్ధంగా ఉన్నట్లైతే కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు.

# వెలుగు నింపే నాయకుడే కావాలి

### నగర బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్




సమావేశంలో మాట్లాడుతున్న నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్ కుమార్, చైర్మన్‌లు కోలేటి దామోదర్ గుప్తా, జగన్ మోహన్ రావు, పార్టీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, ఆశీష్ కుమార్ యాదవ్, వహీద్ అహ్మద్, ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్, నవంబర్ 14: ప్రజల జీవితాలలో వెలుగు నింపే నాయకుడే కావాలని, గోషామహల్ నియోజకవర్గంలో రాముని పేరు చెప్పి ఎమ్మెల్యే రాజాసింగ్ అభివృద్ధిని విస్మరించారని, అలాంటి నాయకుడు మనకొద్దని నగర బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రమంతటా అభివృద్ధి జరుగుతుంటే గోషామహల్ నియోజకవర్గంలో మాత్రం అభివృద్ధి నిలిచి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నందకిషోర్ వ్యాస్ బిలాల్ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, టీఎస్‌టీఎస్ చైర్మన్ పి జగన్‌మోహన్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, ఎం.ఆనంద్ కుమార్ గౌడ్, ఆశీష్ కుమార్ యాదవ్, వహీద్ అహ్మద్, పి.అనిత, ఆనంద్‌సింగ్, కొమ్ముల నరేందర్‌లతో కలిసి ఎన్నికల సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధిని విస్మరించిన రాజాసింగ్ పీడను గోషామహల్ ప్రజలకు పోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నందకిషోర్ వ్యాస్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించారని, ఆయనను గెలిపించేందుకు గాను ఐదుగురు ఇన్‌చార్జ్‌లను నియమించడం జరిగిందని తెలిపారు. గోషామహల్ నియోజకవర్గం ప్రజలు లోతుగా ఆలోచించి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగుర వేసేందుకు మద్దతు తెలిపాలని కోరారు. నవంబర్ 30వ తేదీన ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి నందకిషోర్ వ్యాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గోషామహల్ నియోజకవర్గం మేనిఫెస్టోను కూడా విడుదల చేయడం జరుగుతుందని, ఆ మ్యానిఫెస్టోలో దవాఖానాల అభివృద్ధి, రోడ్లు, ఐటీ, శిక్షణ క్యాంపులు తదితర అన్ని రకాల అభివృద్ధి పనులు చేసేందుకు పొందుపర్చడం జరుగుతుందని, ఎన్నికలలో ప్రజల సహకారంతో విజయం సాధించి ఒక్కొక్క హామీని నెరవేరుస్తామన్నారు. ఎమ్మెల్యేగా ఉండి చంపడానికి, చావడానికైనా సిద్ధమని మాట్లాడడం తగదన్నారు. అలాంటి నాయకుడు ప్రజలకు అవసరం లేదని ప్రజల జీవితాలలో వెలుగు నింపే నాయకుడు కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. గోషామహల్ నియోజకవర్గం గచ్చిబౌలిలా కావాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నందకిషోర్ వ్యాస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై బీఆర్ఎస్‌లోకి..

### బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్ కుమార్



కవాడిగూడ, నవంబర్ 14: సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి. రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీశ్ రావు సమక్షంలో పార్టీలో చేరినట్లు మంగళవారం ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని ఆయన చెప్పారు. తమ చేరికకు సహకరించిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తొమ్మిదేండ్లలో తెలంగాణ అభివృద్ధి పట్ల సీఎం కేసీఆర్ చిత్తశుద్ధి అసమానమైనదని, భవిష్యత్తు తెలంగాణ ఎలా ఉండాలన్న దానిపై కేసీఆర్‌కు స్పష్టత ఉన్నదని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి హరీశ్ రావు ధీమా వ్యక్తం చేసినట్లు ఆయన వెల్లడించారు.

## వైభవంగా హరేకృష్ణ గోవర్ధన పూజ



బంజారాహిల్స్ రోడ్ నం:12లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ స్వర్ణ దేవాలయంలో గోవర్ధన పూజ, ప్రవచనం చెబుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్రగౌర దాస

బంజారాహిల్స్, నవంబర్ 14: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బంజారారాహిల్స్‌లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ స్వర్ణ దేవాలయంలో మంగళవారం సాయంత్రం గోవర్ధన పూజ, అన్న కూటోత్సవం, కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన పర్వతం ఆకృతిలో తయారు చేసిన 350 కేజీల కేక్ చూపరులను ఆకట్టుకుంది. గోపూజతో పాటు పల్లకీ సేవ, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. అనంతరం, హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస ప్రత్యేక ప్రవచనం అందరినీ ఆకట్టుకుంది. దామోదర హారతి, గోవర్ధన హారతి తదితర పూజలు భక్తులను అలరించాయి.

## బాడీ బిల్డింగ్‌లో నగరవాసికి కాంస్యం



మాదాపూర్, నవంబర్ 14: ప్రపంచ బాడీ బిల్డింగ్, ఫిజిక్స్ స్పోర్ట్స్‌లో ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు సౌత్ కొరియాలో జరిగిన ఛాంపియన్ షిప్ పోటీలో తెలంగాణకు చెందిన యువకుడు కటారి సత్యనారాయణను కాంస్య పతకం వరించింది. తెలంగాణలోని మాదాపూర్‌లో నివాసం ఉంటున్న కటారి సత్యనారాయణ ఇది వరకు 2019లో మిస్టర్ ఆసియా కాంస్య పతకం, మిస్టర్ వరల్డ్ సిల్వర్ పతకం, 2022లో మిస్టర్ ఆసియా సిల్వర్ పతకం సాధించడం జరిగింది.

## సేంద్రియంపై శిక్షణ

### 20లోపు దరఖాస్తులకు ఆహ్వానం

సిటీబ్యూరో, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): సేంద్రియ-ప్రకృతి వ్యవసాయంపై కేంద్రీయ వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) ఆధ్వర్యంలో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. జీవ ఎరువులు, జీవ సంబంధిత పురుగు మందులు, మిత్ర పురుగులను ఉపయోగించే పద్ధతులు, క్షేత్రస్థాయిలో వాటి తయారీ విధానాలపై ఆచరణాత్మక శిక్షణ ఉంటుంది. ఇంటర్ పాస్ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసిన 18 ఏండ్ల పైబడిన మహిళలు, పురుషులు అర్హులు కాగా.. ఈ కోర్సులో 25 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుందని, గ్రామీణ యువతకు ప్రాధాన్యం ఉంటుంది. డిసెంబర్ 6న ప్రారంభమయ్యే ఈ శిక్షణ వచ్చే ఏడాది మార్చి 13న ముగియనుంది. ఇందులో 21 రోజుల పాటు రాజేంద్రనగర్‌లోని ఎన్ఐపీహెచ్ఎం ఆవరణలో పాఠాలు, మిగతా 60 రోజులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేయడం, వాటి విధానాలు.. చివరి 10 రోజులు సాగులో ఎదురైన సమస్యలపై శిక్షణ ఇస్తారు. శిక్షణలో భాగంగా ఉచిత వసతి కల్పిస్తారు. భోజన ఖర్చులు మాత్రం అభ్యర్థులే భరించాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.7,500 చెల్లించి నవంబర్ 20లోపు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 95426 38020లో డాక్టర్ కె.దామోదరాచారిని లేదా dirphmniphm-ap లేదా asomicroniphm2019@gmail.com లో సంప్రదించాలని సూచించారు.

## బందోబస్తుపై సీపీ సమీక్ష

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఎన్నికల బందోబస్తులో భాగంగా మంగళవారం శేరిలింగంపల్లి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు సంబంధించిన బందోబస్తు పై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సమీక్ష నిర్వహించారు. మాదాపూర్ డీసీపీ సందీప్, బాలానగర్ డీసీపీ శ్రీనివాస్, అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, పాల్గొన్నారు.